epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 01 | సంచిక : 115 | శుక్రవారం | 20.09.2024



## కాంగ్రెస్‌లో..

# కట్టప్పలు

‘నువ్వు నా పక్కన ఉన్నంత వరకు.. నన్ను చంపే మొగాడు పుట్టలేదు మామా..’ ఇది బాహుబలి సినిమాలో కట్టప్పతో హీరో ప్రభాస్ చెప్పే డైలాగ్.. కానీ.. అదే కట్టప్ప నమ్మిన బాహుబలిని వెన్ను పోటుపొడుస్తాడు.. ఇక మన అసలు కథకి వద్దాం.. జనగామ కాంగ్రెస్ పార్టీలో కూడా ‘కట్టప్పల’ తాకిడి ఎక్కువైనట్టు తెలుస్తోంది. నమ్మిన నేత పక్కన ఉంటూనే వెన్ను‘పోటు’ పొడుస్తున్నారు. ఫలితంగా ఒకప్పుడు కళకళలాడిన పార్టీ ప్రస్తుతం రోజురోజుకూ కుచించుకుపోతోంది. జనగామ కాంగ్రెస్‌లో జరుగుతున్న అంతర్గత యుద్ధంపై ‘మన చౌరాస్తా’ ప్రత్యేక కథనం..

రేపటి సంచికలో..!

### నేతల వెన్నంటి ఉంటూనే వెన్ను‘పోటు’

### నాటి నుంచి నేటి వరకు అదే తీరు

### జనగామ రాజకీయాలపై హైకమాండ్ ఫోకస్



## హెల్త్ హబ్‌గా వరంగల్

- త్వరలో క్యాన్సర్ వరంగల్‌లో ట్రామా సెంటర్ ఏర్పాటు
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా

2



## రేవంత్‌రెడ్డిది హైడ్రామా

3

- మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపణ
- జనగామ ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు ప్రారంభం

General News




# హెల్త్ హబ్‌గా వరంగల్

- త్వరలో క్యాన్సర్ ట్రామా సెంటర్
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా
- నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రి, మెడికల్ కాలేజీ ప్రారంభం

**నర్సంపేట, మన చౌరాస్తా :** వరంగల్ నగరాన్ని హెల్త్ హబ్ మార్చేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, అత్యవసర సమయాల్లో హైదరాబాద్ వెళ్లకుండా ఇక్కడే సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా తెలిపారు. వరంగల్ జిల్లాలో రూ. 183 కోట్ల వ్యయంతో నిర్మించిన నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రి, వైద్య కళాశాలను మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖలతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళ క్యాంటీన్ ను మంత్రులు ప్రారంభించి, తయారుచేసిన వివిధ రకాల చిరుతిండ్ల రుచులు చూశారు. కళాశాల ప్రాంగణంలో మంత్రులు మొక్కలు నాటారు. రూ.2 కోట్ల విలువైన బ్యాంకు లింకేజి చెక్కును మంత్రులు 15 స్వయం సహాయక సంఘాలకు అందజేశారు. నర్సంపేట మండలంలోని రాజుపేటలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్‌డీఎఫ్ నిధుల కింద రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించే బంజారా భవన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. నర్సంపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో అమృత్ 2.0 పథకం కింద రెండు కోట్ల వ్యయంతో చేపట్టే 600 కేఎల్ఈఎల్ఎస్ఆర్ నిర్మాణం, అంతర్గత పైప్ లైన్లు పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు. అనంతరం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి దామోదర మాట్లాడుతూ గత ప్రభుత్వం కేవలం ఎన్నికల హామీగా మాత్రమే ఇచ్చిన ఈ వైద్య కళాశాల , ఆసుపత్రిని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి, ఆచరణలో నిజం చేసి చూపిందన్నారు. మెడికల్ కళాశాల 50 సీట్లతో సంపూర్ణంగా వైద్య సేవలకు ఈ ప్రాంతవాసులు వినియోగించుకునేలాగా అందుబాటులోకి తీసుకొచ్చామని అన్నారు. అత్యాధునిక అంబులెన్సులు, ట్రామా సెంటర్, కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ సెంటర్, ఐవీఎఫ్ సెంటర్, పీడియాట్రిక్ సెంటర్, క్యాన్సర్ సెంటర్ లాంటి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలన్నీ రానున్న రోజుల్లో వరంగల్ కు తీసుకువచ్చి వరంగల్‌ను హెల్త్ హబ్‌గా మారుస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 4 వేల వైద్య ప్రొఫెసర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల ఖాళీలు భర్తీ చేశామని వెల్లడించారు. త్వరలో వరంగల్‌లో రూ .30 కోట్లతో కాన్సర్ ట్రామా సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. 7 వేల మందికి నర్సింగ్ పోస్టులు ఇచ్చి, త్వరలో ఇంకో 2500 మందికి పోస్టింగ్ ఇచ్చే దిశగా నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. త్వరలో కొత్తగా 2 వేల కోట్లతో 31 ఎకరాల్లో ఉస్మానియా ఆసుపత్రిని కొత్తగా నిర్మించబోతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ రాంచంద్రునాయక్, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు డాక్టర్ మురళి నాయక్, కుడా చైర్మన్ ఇనగల వెంకట్రామిరెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారదా, డీఎంఈ వాణి, ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ చైర్మన్లు, అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పరిశుభ్రత మెరుగుపడాలి

- అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్



**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** జిల్లాలోని అన్ని గ్రామాల్లో పరిశుభ్రత మరింత మెరుపడాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ సూచించారు. గురువారం బచ్చన్నపేట మండలంలోని తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్లో స్వచ్ఛతా హి సేవ 2024 కార్యక్రమంలో భాగంగా పిల్లలతో కలిసి అదనపు కలెక్టర్ మొక్కలును నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వచ్ఛతకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం బాగుంటుందన్నారు. ఈ స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం అక్టోబర్ 2వ తేదీ వరకు కొనసాగుతుందని, ఇందులో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. గ్రామాల్లో రోడ్లపై చెత్త వేయకుండా అవగాహన కల్పించాలన్నారు. పాఠశాల పిల్లలకు స్వచ్ఛతా హి కార్యక్రమాలపై వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలను నిర్వహిస్తున్నందున విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి రాము, ఎంపీడీవో, మండల నోడల్ అధికారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచాలి

- 'భోజనం'లో నాణ్యత పాటించాలి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**చిల్పూర్, మన చౌరాస్తా :** విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను మరింతగా పెంచాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం జిల్లాలోని చిల్పూర్ మండలంలోని రాజవరం పంచాయతీ పరిధిలో ఉన్న కేజీబీవీ పాఠశాల, వసతి గృహాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కేజీబీవీ విద్యార్థుల వసతి గృహంలోని మరుగుదొడ్లు, మూత్రశాలలు, వాష్ ఏరియా తదితర మౌలిక వసతులను తనిఖీ చేసి, ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, శుద్ధమైన తాగునీరు అందించాలని, అలాగే వంటగదిని పరిశీలించి, కూరగాయలు, సరకుల నాణ్యతను, ఉడికిన అన్నాన్ని పర్యవేక్షించి, మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. వసతి గృహంలో శుభ్రత చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఔషధ నిల్వలు సరిపడా అందుబాటులో ఉంచాలని మెడికల్ సిబ్బందికి సూచించారు. అలాగే పాఠశాలలోని ఏడు, పదో తరగతి విద్యార్థులతో మమేకమై మాట్లాడారు. వచ్చే పది ఫలితాల్లో 10/10 జీపీఏ సాధించాలని, జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం చిల్పూర్ మండలంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ధరణి, ప్రజావాణి, మీసేవా తదితర పెండింగ్ దరఖాస్తుల వివరాలపై ఆరా తీశారు. వాటి పరిష్కారంలో వేగం పెంచాలని ఆదేశించారు. అలాగే రికార్డు రూంను తనిఖీ చేసి, అన్ని రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఆ తర్వాత అదే మండలంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజాపాలన పెండింగ్ దరఖాస్తులు, ఉపాధి హామీ పెండింగ్ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ వెంకన్న, ఎంపీడీవో శంకర్, తహసీల్దార్ సరస్వతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎన్ఏఎస్‌కు రెడీ కావాలి

**జనగామ, మన చౌరాస్తా :** నవంబర్ 19న జరుగనున్న జాతీయ అచీవ్ మెంట్ సర్వే (ఎన్ఏఎస్)కు విద్యార్థులను సిద్ధం చేయాలని, ఇందుకోసం ఉపాధ్యాయులు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించుకొని ముందుకు సాగాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా సూచించారు. గురువారం ఎన్ఏఎస్‌లో ఉత్తమ ఫలితాలు సాధనలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో నేషనల్ అచీవ్మెంట్ సర్వేపై అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌తో కలిసి సంబంధిత ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల ప్రధాన ఉపాధ్యాయులు, నోడల్ అధికారులతో గూగుల్ మీట్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంగ్లిస్‌పై పట్టు సాధించేందుకు 3, 6, 9వ తరగతుల విద్యార్థులపై దృష్టి పెట్టి ప్రశ్నాపత్రాలను రూపొందించుకోవాలన్నారు. పిల్లలకు మాక్ టెస్టు నిర్వహించాలన్నారు. ఎన్ఏఎస్ పరీక్షలో వచ్చే అన్ని రకాల ప్రశ్నలపై విద్యార్థులను ప్రతిరోజు ప్రాక్టీస్ చేయించాలని సూచించారు. ఈ నెల 21న జరిగే పేరెంట్, టీచర్స్ మీటింగ్‌లో పర్యావరణ పరిరక్షణ, సరైన పారిశుద్ధ్య నిర్వహణ, అలాగే స్వచ్ఛత కార్యక్రమాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ గూగుల్ మీట్‌లో డీఈవో రాము, గుణాత్మక విద్య సమన్వయ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

Local News



# రేవంత్‌రెడ్డిది హైడ్రామా!

- ఎంపీ ఈటల రాజేందర్
- జనగామ ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు ప్రారంభం

**జనగామ, మన చౌరాస్తా :** కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు 'హైడ్రా'కు చట్టబద్ధత లేదని, ఇది కేవలం సీఎం రేవంత్‌రెడ్డి సొంత ఎజెండా అని బీజేపీ జాతీయ నేత, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. గురువారం జనగామ పర్యటనకు వచ్చిన ఆయన స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో పార్టీ ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు ప్రారంభించారు. తర్వాత జూబ్లీ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. అక్రమ నిర్మాణాలు, కట్టడాలను బీజేపీ ఎప్పుడూ కోరుకోలేదన్నారు. చెరువులు, వాగుల రక్షణకు తాము కట్టుబడి ఉన్నామన్నారు. హైడ్రా రాష్ట్రానికి శ్రీరామరక్ష అంటున్న కాంగ్రెస్ నేతలు దానిపై కేబినెట్‌లో, శాసనసభలో ఎందుకు చర్చించలేదో చెప్పాలని ఈటల ప్రశ్నించారు. నాటి పాలకులు పేదలకు 60 నుంచి 80 గజాల స్థలాలు కేటా యించి ఇంటి నిర్మాణాలు చేస్తే.. నేడు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం నోటీసులు ఇవ్వ కుండా నిరుపేదల ఇళ్లను కూల్చివేయడం బాధకరం అన్నారు. చెరువులు ఆక్రమణకు గురైతే అనుభవజ్ఞులతో కమిటీ వేసి చెరువుల సంరక్షణకు చర్యలు చేపట్టాలని తప్ప, రేవంత్‌రెడ్డి ఇలాంటి పిచ్చి పనులు చేస్తే కేసీఆర్‌కు పట్టిన గతే ఆయనకు పడుతుందని విమర్శించారు.



## 'మాచర్ల' మళ్లీ బీజేపీలోకి...

పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు, మాజీ కల్నల్‌డాక్టర్ మాచర్ల భిక్షపతి ఎంపీ ఈటల రాజేందర్ సమక్షంలో గురువారం మళ్లీ బీజేపీలో చేరారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీలో చేరిన ఆయన సీట్ల కేటాయింపులో బీసీలకు అన్యాయం జరిగిందని ఆవేదనతో కమలాన్ని వీడి కారెక్కారు. తాజాగా మళ్లీ ఆయన ఎంపీ సమక్షంలో బీజేపీలోకి చేరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి, నాయకులు సిద్ధారెడ్డి, కేవీఎల్ఎన్. రెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, కొంతం శ్రీనివాస్, మహంకాళి హరిశ్చంద్ర గుప్తా, ఉడుగులు రమేశ్, సౌడ రమేశ్, విజయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాల పనివేళలను శాస్త్రీయంగా నిర్వహించాలి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రంజిత్ కుమార్

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** గురుకులాల పని వేళలను శాస్త్రీయంగా నిర్వహించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రంజిత్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. టీఎస్ యూటీఎఫ్‌గురుకుల జేఏసీ దశల వారి నిరసనలో భాగంగా గురువారం టీఎస్ ఎంఆర్ఈఐఎస్ స్టేషన్‌ఘనపూర్ గురుకులంలో భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అన్ని గురుకుల సొసైటీల్లో ఒకే పనివేళలను నిర్ణయిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అయితే ఆ టైం టేబుల్ శాస్రీయంగా లేదని, విద్యార్థులపై వత్తిడి పెంచేలా ఉందని, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని అన్నారు. పాఠశాలల ప్రాంగణంలో వసతి గృహాలు లేనందున నూతన పనివేళలు సిబ్బందికి కూడా కష్టంగా మారాయన్నారు. ఉదయం 8.00 నుంచి 11.15 వరకు తరగతిలో కూర్చోవటం, కేవలం పది నిముషాల వ్యవధిలో 600 మంది విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకోవడం, ఉదయం స్నానాదులకు కేవలం 15 నిమిషాలు మాత్రమే సమయం నిర్ణయించటం సమంజసం కాదన్నారు. విద్యార్థులకు ఉదయం 7.00 గంటలకు అల్పాహారం అందించి మధ్యాహ్నం 1.00 కు భోజనం పెట్టడంతో



ఆకలికి ఆగలేకపోతున్నారని, సాయంత్రం 4.30 కు స్నాక్స్ ఇచ్చి, 6.30 కే భోజనం పెట్టడంతో సరిగా తినడం లేదని పడుకునే ముందు ఆకలి అంటున్నారని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి పనివేళలు విద్యార్థులకు అనుగుణంగా సవరించాలని రంజిత్ కుమార్ కోరారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల బాధ్యులు ఎండి ఖాదర్ పాష, మైనార్టీ గురుకుల ఉపాధ్యాయులు నజ్మా బేగం, యన్.మాధవీలత, రమ, చంద్రకళ, గౌతమి, నాగ గీత, స్వర్ణలత, అబేదా బేగం, అరుణ, రమణి లక్ష్మి, అజీరా బేగం, సబితా తదితరులు పాల్గొన్నారు.

# బచ్చన్నపేటకు 108 వాహనాన్ని కేటాయించాలి



**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** బచ్చన్నపేట గవర్నమెంట్ హాస్పిటల్‌కు 108 వాహనాన్ని కేటాయించాలని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు అల్వాల నర్సింగారావు కోరారు. గురువారం ఆయన ఆస్పత్రిని సందర్శించి మాట్లాడారు. మండల పరిధిలోని గ్రామాలు దాదాపు 20 కిలో మీటర్లు పరిధిలో ఉన్నందున దూరం నుంచి ఎమర్జెన్సీ రోగులకు కనీసం ప్రైవేటు వెహికల్స్ అందుబాటులో లేక ప్రాణాలు వదిలే పరిస్థితి నెలకొన్నాయన్నారు. ఉన్నత అధికారులు చొరవ తీసుకొని బచ్చన్నపేట మండలానికి 108 వాహనాన్ని తక్షణమే సమకూర్చి పేదల ప్రాణాలకు భరోసా కల్పించాలని కోరారు. గత అసెంబ్లీ ఎలక్షన్లలో స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి బచ్చన్నపేట మండలానికి 108 వాహనాన్ని సమకూరుస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఎమ్మెల్యే తన హాస్పిటల్‌లో నియోజకవర్గ ప్రజలకు ఉచితంగా వైద్యం అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు ప్రకటించారు. అలాగే ఇచ్చిన మాట ప్రకారం మండలానికి 108 వాహనాన్ని అందించాలని కోరారు.

# రిటైర్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

**చేర్యాల, మన చౌరాస్తా :** రిటైర్ ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేర్యాల మండల కేంద్రంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. జిల్లా కన్వీనర్ బేజాడి బాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ టి.సీతారాం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కుటుంబ పెన్షనర్లకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్యం అందించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను ప్రకటించి ఏకకాలంలో బకాయిలను చెల్లించాలని, 40 శాతం ఫిట్ మెంట్‌తో పీఆర్సీని ప్రకటించాలని కోరారు. పెన్షనర్లకు మినిమం పెన్షన్ రూ.9 వేలు చెల్లించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చేర్యాల డివిజన్ టీఏపీఆర్పీఏ నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా మంతెన అంజిరెడ్డి, కరెడ్ల రాజిరెడ్డి, కోశాధికారిగా పుట్ట యాదయ్యతో పాటు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కొడిపల్లి ప్రశాంత్ కుమార్ ఆహ్వానితులుగా పాల్గొన్నారు.

# గ్రామీణ స్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి

**చేర్యాల, మన చౌరాస్తా :** గ్రామీణ స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకే బీజేపీ ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఆ పార్టీ కొమురవెల్లి మండల అధ్యక్షుడు బూర్గోజు నాగరాజు అన్నారు. గురువారం మండలంలోని గౌరాయపల్లిలో ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో సభ్యత్వాన్ని అందరికీ అందించేందుకు తాము కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఆసక్తి ఉన్నవారు 88 0000 2024 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చిన వెంటనే ప్రాథమిక సభ్యత్వం తీసుకోవచ్చని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సభ్యులుగా చేర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలో సభ్యత్వ నమోదు చేసి ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వాన్ని మరింత బలపరచాలని ఇందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో జనగామ అసెంబ్లీ కన్వీనర్ దండ్యాల లక్ష్మారెడ్డి, నాయకులు దండ్యాల భిక్షపతి రెడ్డి, పుట్ట కనకయ్య, కొయ్యడ నవీన్, ఈగ కనకయ్య, చల్ల రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** పోచన్నపేట గ్రామంలో ఇటీవల మృతి చెందిన గౌరు పార్వతమ్మ కుటుంబానికి పోతుల రాములు యాదవ్ రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట కొక్కలకొండ బాబు, బుడిగే రామచంద్రం, ఈర్ల శివరాములు, నరసింగ బాలయ్య, నరసింగ ఎల్లేష్, మామిడి ఐలయ్య, కొక్కలకొండ లింగం, రేణిగుంట సత్యనారాయణ ఉన్నారు.

## కమిషనర్ అశ్విని ఆకస్మిక తనిఖీలు

**హనుమకొండ, మన చౌరాస్తా :** బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే గురువారం ప్రధాన కార్యాలయం లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భం గా కార్యాలయం లో గల ఛాంబర్ లలో క్షేత్ర స్థాయి లో పర్యటించి ఆయా విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకొని హాజరు పరిశీలించారు. ఆయా విభాగాల సిబ్బంది పనితీరు వారు నిర్వహించే విధులను అడిగి తెలుసుకున్నారు.సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరైన రెగ్యులర్ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఒక రోజు వేతనం కోత విధించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ విజయలక్ష్మి, సుపరిండెంట్ ఆనంద్ పాల్గొన్నారు

# ఓటరు జాబితాకు సహకరించాలి

## చేర్యాల ఎంపీడీవో మహబూబ్ అలీ

చేర్యాల, మన చౌరాస్తా : ఓటర్ జాబితాల రూపకల్పనకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని చేర్యాల ఎంపీడీఓ మహబూబ్ అలీ అన్నారు. గురువారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలపాలన్నారు. ఈ నెల 13న గ్రామ పంచాయతీల్లో ఓటరు జాబితా ప్రచురించడం జరిగిందన్నారు. 21వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారని, 26న అభ్యంతరాలు, సూచనలను పరిగణలోనికి తీసుకొని 28న తుది జాబితాను ప్రకటిస్తామని చెప్పారు. ఒక కుటుంబ సభ్యులు ఒకే వార్డులో ఉండాలని, చేర్పులు మార్పులు ఉంటే పంచాయతీ కార్యదర్శులు, పైఅధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో నివాసం లేనివారు, వివాహం చేసుకొని ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, చనిపోయిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించేందుకు సహకరించాలని నాయకులను కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్ము రవి, సీపీఐ పార్టీ మండల కార్యదర్శి



అందె అశోక్, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొంగరి వెంకట్ మావో, బీజేపీ మండల అధ్యక్షుడు కాశెట్టి పాండు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆనంతుల మల్లేశం, టీడీపీ మండల అధ్యక్షుడు ఒగ్గు రాజు, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

WANTED విలేకరులు కావలెను




'మన చౌరాస్తా' తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తి స్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'మన చౌరాస్తా' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9676400812

# అందుకే..బాలీవుడ్‌కు నో..!

## ఆసక్తికర విషయం చెప్పిన రమ్యకృష్ణ

మన చౌరాస్తా, సినిమా : 2015 సంవత్సరంలో ఎస్.ఎస్ రాజమౌళి తెరకెక్కించిన 'బాహుబలి' సినిమా ప్రపంచ వ్యాప్తంగా రూ.650 కోట్ల వసూళ్లు రాబట్టింది. అప్పటికి అదే పెద్ద రికార్డ్. ఆ తర్వాత రెండేళ్లకు 2017లో ఈ చిత్రానికి సీక్వెల్ 'బాహుబలి 2' వచ్చింది. వసూళ్ల పరంగా ఈ సినిమా చరిత్ర సృష్టించింది. ప్రపంచ వ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద రూ.1,788 కోట్ల కలెక్ట్ చేసి తెలుగు సినిమా స్థాయి పెంచేసింది. ఈ సినిమాతో ప్రభాస్ పాన్ ఇండియన్ స్టార్ అయ్యాడు, అయితే ఈ సినిమా ప్రభాస్ కు ఎంత పేరు వచ్చిందో మరో నటికి కూడా అంతే పేరు వచ్చింది. ఆమె ఎవరో కాదు ఈ సినిమాలో శివగామి దేవిగా నటించిన రమ్యకృష్ణ. ఈ సినిమా తర్వాత రమ్య క్రేజ్ మరింత పెరిగింది. అప్పటికే టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా రాణించిన ఆమె.. సెకండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టి అడపాదడపా సినిమాలు చేస్తూ వచ్చింది . కానీ శివగామిగా ఆమె చేసిన పాత్ర ప్రేక్షకులను కట్టిపడేసింది. ఈ సినిమాతో ఆమెకు మంచి పాపులారిటీ వచ్చింది. అయితే అంతకు ముందు రమ్యకృష్ణ సౌత్‌తో పాటు బాలీవుడ్ సినిమాల్లో కూడా నటించింది. అయితే కొంతకాలం తర్వాత హిందీ చిత్ర పరిశ్రమకు దూరమయ్యారు. 1983లో 'వెల్లై మనసు' అనే సినిమా విడుదలైంది. ఈ సినిమాతో రమ్య తన సినీ జీవితాన్ని ప్రారంభించింది. ఇది తమిళ్ సినిమా. ఆ తర్వాత భలే మిత్రులు సినిమాతో తెలుగు చిత్రసీమలోకి అడుగుపెట్టింది రమ్యకృష్ణ. ఆ తర్వాత ఆమె మలయాళం, కన్నడ భాషా చిత్రాలలో కూడా కనిపించింది. అలాగే 1988 సంవత్సరంలో రమ్య తన తొలి హిందీ సినిమా చేసింది. 1988లో ఫిరోజ్ ఖాన్, రాజేష్ ఖన్నా, అమ్రిష్ పూరి నటించిన 'దయావాన్' అనే చిత్రం విడుదలైంది. ఈ సినిమా ద్వారా రమ్యకృష్ణ బాలీవుడ్‌కి పరిచయం అయ్యింది. ఇందులో ఆమె డ్యాన్సర్ పాత్రలో కనిపించింది. ఆ తర్వాత ఈ సీనియర్ బ్యూటీ అమితాబ్ బచ్చన్ , గోవిందాల 'బడే మియాన్ చోటే మియాన్' అలాగే షారుఖ్ ఖాన్ 'చాహత్' వంటి అనేక హిందీ చిత్రాలలో నటించింది. ఆ తర్వాత అనుకోకుండా హిందీకి దూరం అయ్యింది. దీని గురించి గతంలో ఆమె మాట్లాడుతూ.. హిందీ చిత్రసీమలో తన సినిమాలేవీ పెద్దగా ఆడలేదని, అయితే అప్పటికే తాను తెలుగు సినిమాల్లో స్టార్ గా మారిపోయానని అని చెప్పింది. తెలుగు సినిమాని వదిలి బాలీవుడ్‌లో చేసే రిస్క్ తాను తీయను అని అందుకే బాలీవుడ్‌కి దూరంగా ఉంటున్నా అని ఆమె అన్నారు. ఏ ఇండస్ట్రీలో అయినా సక్సెస్ ఫుల్ సినిమా ఇవ్వడమే ముఖ్యమని, తెలుగులో ఇస్తున్నానని, తెలుగులో హాయిగా ఫీల్ అవుతున్నానని రమ్యకృష్ణ చెప్పుకొచ్చారు.